కుర్మగూడలో తిరంగా ర్యాలీ



మాదన్నపేట ర్యాలీలో పాల్గొన్న సహదేవ్ యాదవ్

చంచల్‌గూడ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత్ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సోమవారం బీజేపీ, వివిధ పాఠశాలల విద్యార్థులు కుర్మగూడ డివిజన్‌లో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రను పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ కె. సహదేవ్ యాదవ్ ప్రారంభించారు. జాతీయ జెండాలను పట్టుకుని డివిజన్ వ్యాప్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ యాత్రలో భాగ్యనగర్ జిల్లా నాయకులు తంగెళ్ల సుదీర్, నిరంజన్ యాదవ్, శ్రీనాథ్, బండ వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) అని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. సోమవారం ఆర్‌కేపురం ఎన్టీఆర్‌నగర్‌లో ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ సోషలిజమే గమ్యంగా, ప్రభుత్వ విద్య, సెక్యులరిజం, ప్రజాస్వామ్య పరిరక్షణే కర్తవ్యంగా ఏఐఎస్‌ఎఫ్ ఉద్యమిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అరుణ్, సరూర్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాతరాజు భవానీ, పి.వినోద్, సహాయ కార్యదర్శి రేణుక, కార్యవర్గ సభ్యులు ఉష, భాగ్య, శ్వేత, నికిత, అరవింద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వరద పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన



వనస్థలిపురం: అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో జరుగుతున్న వరదనీటి పైపులైన్ నిర్మాణం పనులను అధికారులతో కలసి ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని నిర్మలానగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి యాభై లక్షల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న పెండింగ్ పనులను ప్రత్యేక నిధులతో ప్రాధాన్యతాక్రమంలో దశలవారీగా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్‌గుప్తా, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భాస్కరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

మలక్‌పేట: పేదలు ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యదా గజల్స్ ఫాతిమా అన్నారు. యూపీహెచ్‌సీ శాలివాహననగర్ ఆధ్వర్యంలో సోమవారం గడ్డిఅన్నారం రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేసి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు జి.శ్యామ్‌రావు, బొట్టు శ్రీను, బి.లక్ష్మణ్, సంతోష్, ఏఎన్‌ఎం రెబెకా, ఆశ వర్కర్ మంజుల,పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పోదార్ ఇనిస్టిట్యూషన్‌లో ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ –24 కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు బాల బసన్న నాయకత్వం వహించారు. సోమవారం నిర్వహించిన వేడుకలో గ్రాడ్యుయేట్‌లందరికీ అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

నాగోలు: విద్యుత్ షాక్‌కు గురైన యువతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎల్‌బీనగర్ పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన చిలుముల కృష్ణ కుమార్తె అరుణ(23) కొంతకాలంగా ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటూ ఎల్‌బీనగర్‌లోని ఫ్లై డిస్టినేషన్ కన్సల్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 10న అరుణ తన కార్యాలయంలో గూగుల్ మ్యాప్ సంస్థ నుంచి కొంతమంది అక్కడికి వచ్చారు. అరుణ ఉద్యోగం చేసే కార్యాలయం ముందు బాల్కనీలో ఒక ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో అరుణ బోర్డు పట్టుకుని సహాయం చేస్తుండగా ప్రమాదవశాస్తు కరెంట్ షాక్‌కు గురై పడిపోయింది. చుట్టుపక్కల వారు అరుణను ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందిందని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

నాగోలు: అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్య పాల్పడింది. నాగోలు పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... నాగోలు బీకే రెడ్డి కాలనీ, వెంకటరమణ కాలనీలో నివాసం ఉండే బి.వి.ఎస్ అరుణ్‌కుమార్, భాగలక్ష్మి భార్యభర్తలు. సచ్చిన్ విహార్ సంతాన. గత ఆరేళ్లుగా భాగ్యలక్ష్మి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆమె మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతూ సోమవారం భర్త ఇంట్లో లేని సమయంలో తన బెడ్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నితో ఉరేసుకుంది. అరుణ్‌కుమార్ వచ్చి ఆమెను కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. భాగ్యలక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుందని ఆమె సోదరుడు నాగోలు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నాగోలు కేసు నమోదు చేసుకుని అమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

విషజ్వరాలు.. విలవిల..

- ఆసుపత్రులలో బారులు తీరుతున్న రోగులు
- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి ఓపీ పేషంట్లు రోజుకు 600 మంది

'సాక్షి' విజిట్..

వనస్థలిపురం/హయత్‌నగర్: అసలే వర్షాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు.. విషజ్వరాలు.. జనం అల్లాడుతున్నారు. వైద్యం కోసం ఆసుపత్రులకు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో రోగులు బారులు తీరుతున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద, వైద్య పరీక్షల కోసం సంబంధిత డాక్టర్ వద్ద, ల్యాబ్ టెస్ట్‌ల కోసం, మందుల కోసం రోగులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో నిలుచుంటున్నారు. గర్భిణులు, పిల్లలు, కుక్కకాటు బాధితులు, విషజ్వరాల బారిన పడిన వారి కోసం ప్రత్యేకంగా ఓపీలు ఏర్పాటు చేశారు. కాగా, విషజ్వరాల బారిన పడినవారే అధికంగా వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో రోజుకు 400 మంది ఓపీ పేషంట్లు ఉండగా ఇటీవల వారి సంఖ్య 600 వరకు పెరిగిందని తెలిపారు. కుక్కకాటు బాధితులు రోజుకు 30 నుంచి 50 మంది వరకు వస్తున్నారన్నారు.

హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో...

హయత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. విషజ్వరాలతో ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య గతంలో కంటే రెట్టింపు అయింది. రోగుల సంఖ్య పెరుగుతున్నందున గర్భిణులు, పిల్లలకు వేరువేరుగా ఓపీలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నామని వైద్యులు చెపుతున్నారు.



ఇంజక్షన్‌ల కోసం వేచివున్న కుక్కకాటు బాధితులు



కుమారునితో చిరంజీవి



హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స కోసం తల్లితో కలసి వచ్చిన యువతి

సీరియస్ కేసులు ఏమి లేవు...

వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. కానీ, సీరియస్ కేసులు ఏమీ లేవు. ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నాం. కుక్కకాటుకు, పాము కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వారికి ప్రథమ చికిత్స చేసి పెద్ద ఆసుపత్రికి పంపిస్తున్నాం. గర్భిణులు, పిల్లలకు వేరువేరుగా ఓపీలు నిర్వహిస్తున్నాం.

– ఉమాదేవి, హయత్‌నగర్ మెడికల్ ఆఫీసర్

జనాల తాకిడి ఎక్కువైంది..

మా కుమారునికి జ్వరం రావడంతో హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చాం. ఒక టెస్ట్ చేశారు. ఇంకా మూడు టెస్ట్‌లు చేయాలని చెపుతున్నారు. ఇక్కడ చూస్తే క్యూలైన్లు పెద్దగా ఉంటున్నాయి. మాకు ఎప్పుడు వైద్యసేవలు అందుతాయో తెలియని పరిస్థితి ఉంది.

– చిరంజీవి, హయత్‌నగర్

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం...

విషజ్వరాలతో రోజుకు 600 మంది ఆసుపత్రికి వస్తున్నారు. అందులో రోజుకు 20 నుంచి 30 మందికి డెంగీ పాజిటివ్ వస్తోంది. వారికి ప్రత్యేకవార్డు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నాం. కుక్కకాటు బాధితులు కూడా రోజుకు పదుల సంఖ్యలో వస్తున్నారు. కుక్క, పాము, తేలు కాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వైద్య సిబ్బంది కూడా ఉన్నారు.

– డా.ఎస్.కృష్ణ, జనరల్ ఫిజీషియన్, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు...

భూలక్ష్మీనగర్, తిరుమలహిల్స్, గడ్డిఅన్నారం, కళ్యాణ్‌నగర్ పరిసర ప్రాంతాలు.

- మధ్యాహ్నం 12 గంటల నుంచి 1:30 వరకు...

తిరుమలహిల్స్, రెవిన్యూబోర్డ కాలనీ, గడ్డిఅన్నారం, నారాయణ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

బాల్యంలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

హస్తినాపురం: విద్యార్థులు బాల్యంలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, తద్వారా వారు జీవితాల్లో ఉన్నతస్థాయికి ఎదుగుతారని అక్షర విద్యాసంస్థల సీఈవో మదన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టీచర్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగివున్న నాయకత్వపటిమను గుర్తించి వెలికి తీసే విధంగా పలు కార్యక్రమాలను స్కూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మదన్‌మోహన్‌రావు, రమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పేదజంట వివాహానికి ఆర్థికసాయం

నాగోలు: మొగుళ్లపల్లి యువసేన ఉపేందర్ ఆధ్వర్యంలో కొత్తపేట కన్యాకా పరమేశ్వరి దేవాలయం 214వ ఉచిత వివాహం ధనలక్ష్మి- శివ కుమార్‌లకు హిందూ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అధ్యాత్మిక వేత్త, దేవీ ఉపాసకురాలు దివ్య శ్రీ రమణ చక్రవర్తులు దివ్య ఆశీస్సులు అందచేశారు. ఈ వివాహ వేడుకల్లో తెలంగాణ వైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, మాజీ టూరిజం ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ హాజరై నూతన దంపతులకు ఆశీస్సులు అందచేశారు. ఈ కార్యక్రమకు బంగారు పుస్తెలు మట్టెలు చిదర రమేష్ అందజేశారు. శ్రవణ్ దేవరకొండ, జనార్దన్ మంచికంటి, ఎర్రం కృష్ణమూర్తి, మొగుళ్లపల్లి కృష్ణమూర్తి, పెద్ది చంద్రమౌళి పండిట్ శ్రీనివాస్, రామిని విజయ్, బస్సా శ్రీనివాస్, జనార్దన్ ఆకారపు, రవి, తుమ్మల బాల్‌రెడ్డి, బొగ్గారపు వెంకటేశం ఆర్థిక సహాయం అందచేశారు. యువ సేన అధ్యక్షుడు సీహెచ్ పవన్, వై.సత్యనారాయణ, రాఘవరెడ్డి చొల్లేటి ఆనంద్ ప్రముఖులు పాల్గొన్నారు.

అవయవదాన ప్రతిజ్ఞలకు క్యూఆర్ కోడ్

- మరణాంతరం అవయవాలను దానం చేస్తున్నట్లుఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రతిజ్ఞ



అవయవదానం డిజిటల్ కియోస్క్‌ను ప్రారంభిస్తున్న సజ్జనార్, డాక్టర్ గాయత్రి

మన్సూరాబాద్: అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని, ప్రజలందరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ, అదనపు డీజీపీ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. అవయవదానం దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ ఇందిరా ఆడిటోరియంలో అవయవదానం అవగాహన ప్రచారం ప్రారంభించి, అవయవదాన ప్రతిజ్ఞలకు క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. తన మరణాంతరం తన అవయవాలను దానం చేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ మరణించిన వారి శరీరంలోని ముఖ్యమైన అవయవాలను దానం చేస్తే మరో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అన్నారు. అవయవదానాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని పేర్కొన్నారు. కామినేని హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ హాస్పిటల్ ఆవరణలో డిజిటల్ కియోస్క్‌ను ఏర్పాటు చేశామని, అవయవదానంపై ఆసక్తి కల వారు వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కామినేని హాస్పిటల్స్ ఎండీ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్ఐటీఐలో నేషనల్ స్పేస్ డే వేడుకలు



నేషనల్ స్పేస్ డే వేడుకల్లో పాల్గొన్న రాధాదేవి తదితరులు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(జీఎస్ఐటీఐ)లో అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయి 105వ జయంతిని పురస్కరించుకుని నేషనల్ స్పేస్ డే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'భూవిజ్ఞాన శాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత ఉపయోగాలు'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్వాన్స్‌డ్ డేటా ప్రాసెసింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాధాదేవి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, భూవిజ్ఞానశాస్త్రంలో అంతరిక్ష సాంకేతికత, చంద్రయాన్–3 ల్యాండింగ్ సైట్ జియాలజీ, అంతరిక్ష సాంకేతికత వినియోగం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు ప్రసగించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌ఓఐఎస్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణన్, ఐఎస్ఆర్ఓ శాస్త్రవేత్త డాక్టర్ ఈశ్వర్‌చంద్రదాస్, ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ సెంథిల్‌కుమార్, జీఎస్ఐటీఐ డైరెక్టర్ ఆర్ విజయ్‌కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విద్యార్థులు, నల్లా మల్లారెడ్డి కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విద్యార్థులు, ఇందూ ఇంటర్నేషన్ స్కూల్, భాష్యం స్కూల్, తెలంగాణ మైనార్టీ, సంస్కృత స్కూల్ విద్యార్థులతోపాటు జీఎస్ఐటీఐ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారికి కి'లేడీ' బురిడీ

10 తులాల నగలతో పరారీ

నాగోలు: ఓ వ్యాపారిని బురిడీ కొట్టించి అతని వద్ద ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలతో ఓ మహిళ పారిపోయింది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని నెల్లూరు జిల్లా కావలికి చెందిన షేక్ విజయసాగర్ వ్యాపారి. ఈ నెల 5న షాపింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఎల్‌బీనగర్ రాక్‌టౌన్ కాలనీలోని తన సొదరుడి గదిలో ఉన్నాడు. ఈ క్రమంలో సొదరుడి స్నేహితురాలితో ఫోన్‌లో పరిచయమైంది. ఈ నెల 9న ఎల్‌బీనగర్ వస్తున్నానని ఫ్రెషప్ కోసం హోటల్ గదిని బుక్ చేయమని కోరింది. దీంతో విజయ్‌సాగర్ ఆమె మాటలను నమ్మి ఎల్‌బీనగర్‌లోని శ్రీకర హాస్పిటల్ ఎదురుగా ఉన్న విరాట్ గ్రాండ్ హోటల్‌లో ఓ గదిని బుక్‌చేశాడు. అనంతరం ఇద్దరూ కలిసి హోటల్ గదికి వెళ్లారు. సదరు మహిళ చెప్పిన మాటలు నమ్మి తన దగ్గర ఉన్న 4 తులాల బంగారం చైన్, 3.5 తులాల బంగారం కడియం, 2.5 తులాల బంగారు రింగ్స్ టేబుల్‌పై పెట్టి ఫ్రెషప్ కోసం వాష్‌రూమ్‌కి వెళ్లాడు. అతను 20 నిమిషాల తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి ఆమెతోపాటు బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో విజయ్‌సాగర్‌కు మహిళకు ఫోన్ చేయగా, బంగారు వస్తువులు తన వద్ద ఉన్నాయని, తిరిగి శనివారం ఉదయం వచ్చి ఇస్తానని చెప్పింది. మరుసటి రోజు తిరిగి రాకపోవడమే కాకుండా విజయ్ సాగర్ ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి తప్పించుకుంది. దీంతో బాధితుడు మోసపోయినట్లు తెలుసుకుని ఆదివారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మోసం చేసిన మహిళ పేరు కొమరగిరి శ్రీలక్ష్మి అని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

మన్సూరాబాద్: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం స్కూటీ ర్యాలీ నిర్వహించారు. మన్సూరాబాద్‌లోని ప్రధాన రాహదారుల గుండా పలువురు మహిళలు స్కూటీలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళామోర్చా అధ్యక్షురాలు పోరెడ్డి కవితారెడ్డి, నేతలు మంగ, మాధవి, అనిత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పనితీరు భేష్

చంపాపేట: చంపాపేట చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనితీరు భేషుగ్గా ఉందని సరూర్‌నగర్ ఎంఈఓ భాసునాయక్ కితాబునిచ్చారు. సోమవారం ఆయన పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల రికార్డు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, తాగునీటి సదుపాయం, టాయ్‌లెట్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనంతరెడ్డి, ఉపాధ్యాయులు రజిత, జ్యోతి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



అజీమ్ మృతదేహం

నాగోలు: ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎండీ అజీమ్(45) భార్య ఫాతిమా సుల్తానాతో కలిసి నివాసముంటున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బేకరీలో పనిచేసే అజీమ్ కొంతకాలంగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో అతడి భార్య ఫాతిమా సుల్తానా ఇళ్లల్లో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తుంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం పనికి వెళ్లిన ఫాతిమా మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి చూడగా బెడ్ రూమ్ తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి చూడగా అజీమ్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఫాతిమా సుల్తానా ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మల్లేష్

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఈ.మల్లేష్ నియమితులయ్యారు. గతంలో వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్‌లో పనిచేశారు. సాధారణ బదిలీలలో భాగంగా హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్‌గా నియమితులయ్యారు. చైర్మన్ లేని వ్యవసాయ మార్కెట్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్–1 అధికారి చిలుకా నర్సింహారెడ్డి తెలిపారు.

గిరిజన హక్కులను కాపాడుకోవాలి



ఎల్‌బీనగర్‌లో ఆటోస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో గిరిజన నాయకులు

వనస్థలిపురం: ఐక్య ఉద్యమాల ద్వారా గిరిజన హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీనాయక్ అన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా సోమవారం ఎల్‌బీనగర్‌లోని ఆటోస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటోడ్రైవర్లకు కిరాయిలు దొరక్క ఇంటి అద్దె, సూలు ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంగోత్ శ్రీను, రమావత్ రాములు నాయక్, పాండు నాయక్, జైపాల్ నాయక్, మంగ్య, శంకరయ్య, అనిల్, హన్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు...
భయాందోళనలో స్థానికులు



మన్సూరాబాద్ సహారా రోడ్డులో ప్రమాదకరంగా తెగి పడిపోయిన 33 కేవీ విద్యుత్ తీగలు

మన్సూరాబాద్: అత్యంత ప్రమాదకరమైన 33 కేవీ విద్యుత్ లైన్ తీగలు తెగి కిందపడటంతో స్థానికులు, వాహనదారులు బెంబేలెత్తారు. వివరాల్లోకి వెళితే... మన్సూరాబాద్‌లోని సహారా–కామినేని హాస్పిటల్ ప్రధాన రోడ్డు ఆయిల్ మిల్ వద్ద 33 కేవీ విద్యుత్‌లైన్ తీగలు సోమవారం మధ్యాహ్నం తెగి కిందపడిపోయాయి. బాగా రద్దీగా ఉండే ప్రదేశమైన విద్యుత్ తీగలు తెగిన సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి వెంటనే స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు 33కేవీ లైన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 15 రోజులక్రితం కూడా ఇలాంటి సంఘటనే జరిగిందని స్థానికులు భయాందోళనలో ఉన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదకరమైన విద్యుత్ తీగలు తెగిపడిపోతున్నాయని, పెనుప్రమాదం ఏర్పడక ముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాలు

మన్సూరాబాద్: సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో సోమవారం కేరళ వరద బాధితులకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్ పారిశ్రామికవాడలో రూ.11,150 సేకరించి సీఐటీయూ రాష్ట్ర కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగం, నర్సింహ్మా, లింగస్వామి, రాఘవేందర్, కృష్ణ, వెంకటమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నేతలు

ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

సైదాబాద్: భర్తతో గొడవ పడిన భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... ఎల్‌సీహెచ్ చిన్న కాలనీలో నివసించే కూరగాయల వ్యాపారి ఎర్రోళ్ల సంతోష్ ఈ నెల 9న మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వెళ్లి భార్య భాగ్యలక్ష్మి (40)తో గొడవ పడ్డాడు. తరువాత బయటకు వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తాళం వేసి ఉంది. భాగ్యలక్ష్మి తమ ముగ్గురు పిల్లలు జీవన్ (13), హేమంత్ (12), లోకేష్ (7)లతో కలిసి బయటికి వెళ్లిపోయింది. వారి కోసం సంతోష్ ఎక్కడ విచారించినా ఆచూకీ తెలియలేదు. దాంతో ఆదివారం అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE
HON'BLE PRL.DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT
AT::L.B.NAGAR
G.W.O.P.No. 66 OF 2024
BETWEEN:-
Joshi Sharada & another ...Petitioners
AND
All Concerned ...Respondent
To,
All Concerned
You are hereby informed that the Petitioners in the above G.W.O.P. filed in the above said Hon'ble Court seeking for the relief of selling away or alienate the 1/3rd share of Minors' Property i.e., property of Karanam Raghunatha, S/o. late Karanam Kalyan Chakrawarthi, Aged 13 years who is the son of late Karanam Kalyan Chakrawarthi & the petitioner No.1, in the petition schedule property i.e., the house bearing H.No.10-1-92/3/81B, PTIN No. 1031001027 consisting Ground Floor and First Floor admeasuring 157.50 Sq. Yards equivalent to 131.68 Sq. Mts., having Plinth area of 990 Sq. fts., in Ground Floor, 410 Sq. Fts., in First Floor constructed in Plot No.81B, Sy.No.39, situated at Janaki Enclave, Lingojiguda, Saroornagar Mandal, under L.B.Nagar Municipality, Ranga Reddy District, bounded by: North: Plot No.22; South: Plot No.24; East: 20 Feet wide road & West: Neighbour's Plot: and to deposit sale proceeds of the same in any nationalized Bank in the name of the said minor, after excluding the maintenance and educational expenses etc., and to spend interest accrued thereon for the personal needs of the said minor petitioner No.2 till he attains majority and the same is stood posted to 22.08.2024. If any person(s) had any objection to it, he/they may approach the above said Hon'ble Court by 10.30 a.m., on 22.08.2024 either in person or through their counsel, duly instructed. Otherwise, the matter will be decided exparte.
By order of the Court
GAJJALA VENKATA REDDY, ADVOCATE
Plot No.80/ B, H.No.11-13-177/ 1, Road No.3, Green Hills Colony, R.K.Puram, Kothapet, Hyderabad, Mobile: 9989286688